


**కథ**

**డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం**

# భానుమూర్తి భాషాభిమానం

ఆ రోజు పేపర్లో వచ్చిన వార్త చదవగానే భానుమూర్తి ఆనందం పట్టలేక కుర్చీలోనుండి లేచి ఒక్క గెంతు గెంతి 'ఓహో' అంటూ గట్టిగా అరిచాడు.

అసలే ఎత్తు తక్కువగా వున్న ఇల్లు కావడంతో అతని తలకి ఠాప్పున పైకప్పు కొట్టుకుని బొప్పి కట్టింది.

ఆ అరుపు విన్న భ్రమరాంబ అదిరిపడి చేతిలో పట్టుకున్న కాఫీ గ్లాసు క్రిందకి వదిలేసింది. వేడి కాఫీ కాళ్ళమీద పడి కాలి, కెవ్వుమంటూ తానూ అరిచింది.

ఆమె అరుపువిని ఏవయిందా అనుకుంటూ తల మీద బొప్పి తడుముకుంటూ లోపలికి వస్తున్న భానుమూర్తి, కాలినకాలుతో కుంటుకుంటూ ఎందుకలా కేక పెట్టాడా అని ముందుగదిలోకి వస్తున్న భ్రమరాంబ ఇరుగ్గా వున్న గుమ్మం దగ్గర ఢీ కొట్టుకున్నారు.

అబ్బా అంటూ ఇద్దరూ క్రింద కూలబడ్డారు.

"ఏవయిందండీ అలా అరిచారు. గుండెలు అదిరిపోయి కాఫీ గ్లాసు కాళ్ళమీద పడేసుకున్నా" అని అడుగుతూ మొగుడికేసి చూసిన భ్రమరాంబకు అతని తలమీద పెద్దఉసిరికాయ ప్రమాణంలో బొప్పి కనబడింది.

"అయ్యో! అంత దెబ్బ ఎలా తగిలిందండీ! ఆ నొప్పి తట్టుకోలేక అంతగా అరిచి వుంటారు. ఈ ముదనష్టపు ఇంట్లో ఫాన్లు తలకు తగులుతుంటాయి" అంటూ సానుభూతి చూపింది భ్రమరాంబ.

"నొప్పితో అరచిన అరుపు కాదే..ఆనందం పట్టలేక అరిచి గెంతాను. తలకు తగిలింది. నీ కాళ్ళూ కాలాయి. సరే కాస్త కొబ్బరినూనె పట్టించు. నేను మా బాస్ ఇంటికి వెళ్ళొస్తా" అంటూ చెంగున లేచి మాసిన అద్దపంచె, బనీను వేషంలోనే వీధిలోకి వురికాడు..భానుమూర్తి.

భానుమూర్తి పనిచేస్తున్న ఆఫీసు మానేజరు పక్క వీధిలోనే వుంటాడు. ఆయనొక వర్ధమాన రచయిత. పేరు ప్రకాశరావు. ఈమధ్యనే బదిలీమీద కర్నూలుకు వచ్చాడాయన. తన ఆఫీసులో పనిచేస్తున్న భానుమూర్తికి తెలుగుభాష మీద గొప్ప అభిమానమని అక్కడికి వచ్చిన రెండవ రోజే ఆయనకు అర్ధమయింది.

పాత మానేజరుగారికి వీడ్కోలు, కొత్త బాస్‌గారికి ఆహ్వానం పలుకుతూ ఆఫీసులో ఏర్పాటు చేసిన సభలో భానుమూర్తి ఆవేశంగా వుద్వేగంగా ప్రసంగించాడు.

"ఉరిమి ఉరిమి మంగళం మీద పడ్డట్టు మీవంటి సాహితీమూర్తులు మా పై అధికారిగా రావడం మా అదృష్టం" అంటూ ఆనందాన్ని ప్రకటించాడు.

ఆరోజు నుండీ భానుమూర్తిని కాస్త దూరంగా వుంచాడు ప్రకాశరావు.

ఈరోజు హఠాత్తుగా వచ్చి ఇంట్లో దూరిన భానుమూర్తి అవతారం చూసిన ప్రకాశరావుగారికి 'పెళ్ళాం చీపురుకట్టతో వెంటబడితే పారిపోయి వచ్చాడా' అన్న అనుమానం కలిగింది.

"అలా కూర్చోవయ్యా భానుమూర్తీ! ఆయాసం తీరాక విషయం చెప్పు" అన్నాడాయన ఆదరంగా.

"ఒక్కక్షణం కూడా ఆగలేను సార్. ఇన్నాళ్ళుగా పాముకు పాలు పోసి పెంచినట్టు సాహిత్యానికి సేవ చేస్తున్న మీకు ఇప్పటికి గొప్ప గుర్తింపు వచ్చింది. మీ నవలకు ప్రథమ బహుమతి వచ్చిందని పేపరులో చూసి మిమ్మల్ని అభినందించాలని పరుగున వచ్చాను. ఈ శుభ సందర్భంగా ఆఫీసులో మీకు అభినందన సభ ఏర్పాటు చేద్దామనుకుంటున్నాను" ఆవేశపడ్డాడు భానుమూర్తి.

తెలుగు భాషకు సామెతలే పట్టుకొమ్మలనీ, మూలస్తంభాలనీ నమ్మిన భానుమూర్తి తన భాషాభిమానం చాటుకోవడానికి విరివిగా సామెతలు ఉపయోగిస్తుంటాడు. అయితే వాటిని అసందర్భంగా అడ్డగోలుగా వాడేస్తాడు.

ప్రకాశరావువంటి వారికి అవి పంటికింద రాయిలా తగులుతుంటాయి.

"మీవంటి భాషాభిమానులైన పాఠకుల అభిమానమే మాకు గొప్ప సన్మానం భానుమూర్తీ!" అన్నాడు ప్రకాశరావు భానుమూర్తి తన గురించి వాడిన సామెతలు తలలో మోదుతుండగా.

"అలా అనకండి సార్ 'కోతికి కొబ్బరికాయ దొరికినట్టు' నాకు ఈ అవకాశం దొరికింది. మిమ్మల్ని సత్కరించే అదృష్టం మాకు కలిగించండి!" అంటూ మానేజరుగారి రెండు చేతులూ పట్టుకున్నాడు.

అంతలో నడుము దగ్గర పంచెకట్టు వదులుకావడం వలన ఆయన చేతులు వదిలేసి పంచె బిగించి కట్టుకుని 'నాకు సెలవీయండి సార్. 'బూడిదలో పోసిన పన్నీరులా' నేను సన్మానం ఏర్పాట్లు చేసుకోవాలి" అని హడావుడిగా వెళ్ళిపోయాడు.

అన్నట్టుగానే మరుసటిరోజు సాయంత్రం ఆఫీసులో మీటింగ్ హాల్లో అభినందన సభ ఏర్పాటుచేసాడు భానుమూర్తి.

"మన మానేజరు ప్రకాశరావుగారి కథలు, నవలలు చదివినవారికి ఆయనను పరిచయం చేయడమంటే 'అగ్నిలో ఆజ్యం పోసినట్టే' అని నా అభిప్రాయం. ఇంత గొప్ప రచయిత మన మధ్యన వున్నపుడు మనం గర్వపడాలి. ఆయన రచనలు చదవడమంటే 'రోట్లో తలదూర్చి రోకటి పోటుకు వెరచినట్టే' ఈ అవార్డు వచ్చినందుకు వారిని అభినందిస్తూ 'అసలే కోతి, అందులో కల్లు తాగింది' అన్నట్టుగా ఆయన మరింత రెచ్చిపోయి ఇంకా ఎన్నెన్నో రచనలు చేయాలని ఆకాంక్షిస్తున్నాను. మన మానేజరుగారిని ప్రేరణగా తీసుకుని మన ఆఫీసులోని సాహితీ మిత్రులు, తెలుగు భాషాభిమానులు తాము కూడా రచనలు చేయాలనీ 'తాడిని తన్నే వాడి తల తన్నే వాళ్ళమ'ని నిరూపించుకోవడానికి తమ శాయశక్తులా ప్రయత్నించి విజయం సాధించాలని నా కోరిక. తెలుగు భాష మనది. తెలుగు జాతి మనది. జై తెలుగు! జై జై తెలుగు" అంటూ చేతులు పైకెత్తి నినదించి ఉపన్యాసం ముగించాడు.

ప్రకాశరావుగారి ముఖం చెక్కుతీసిన కందగడ్డలా వుంది. ఆయనకు శాలువా కప్పడం, జ్ఞాపిక బహూకరించడం అయ్యాక "ఇప్పుడు సార్ తనకు అపూర్వ గౌరవాన్ని తెచ్చిన నవల గురించి చెప్పా

లనీ, అలాగే 'తాతకు దగ్గులు నేర్పినట్టు' మనకు కథారచన గురించి కొన్ని సూచనలు ఇవ్వాలనీ కోరుతున్నాను" అని ఉపన్యాసం ముగించాడు.

తప్పనిసరి పరిస్థితి గనుక ప్రకాశరావు లేచి నిలబడి మైకు అందుకున్నాడు. తనకు సన్మానం జరిపినందుకు కృతజ్ఞతలు తెలిపాడు. "భానుమూర్తిగారికి తెలుగు భాష పట్ల ముఖ్యంగా తెలుగు సామెతల పట్ల వున్న అభిమానం మెచ్చుకోదగిన విషయం. రచనలకు పూనుకునే ముందు ఆయన సామెతల గురించి మరింత లోతుగా అధ్యయనం చేసి, కృషి చేయగలరని నా సలహా" అని చెప్పి కూర్చున్నాడు.

వందన సమర్పణ చేస్తూ భానుమూర్తి "ఆద్యంతమూ రసవత్తరంగా సాగిన సభను విజయవంతం గావించిన నా సహ ఉద్యోగులకు కృతజ్ఞతలు. సామెతల విషయంలో మన మానేజరుగారు నాకిచ్చిన ప్రోత్సాహంతో 'గుడ్డెద్దు చేలో పడినట్టుగా' దూసుకుపోతానని వారికి సభాముఖంగా మాటిస్తున్నాను" అంటూ కన్నీటితో ప్రకాశరావుకు పాదాభివందనం చేసాడు.



* * *


భానుమూర్తి పొరుగింట్లో శంకరంగారని రిటైర్డ్ హెడ్ మాస్టరుగారి కుటుంబం వుంటున్నారు. శంకరంగారి భార్య అపర్ణకు, భానుమూర్తి భార్య భ్రమరాంబకు కూరలు, పచ్చళ్ళు ఇచ్చిపుచ్చుకునేంత స్నేహం. శంకరంగారికి ఒకత్తె కూతురు. చక్కని పిల్ల. ఎమ్.ఎస్.సి. దాకా చదివింది. పెళ్ళయి ఏడాది అయింది. అల్లుడు కాలేజీలో లెక్చరరు. కట్నకానుకలు బాగా ముట్టచెప్పారు కూడా.

ఒకరోజు పొద్దున్నే పనిమనిషి, భ్రమరాంబకు

ఒక విశేషమైన కబురు మోసుకొచ్చింది. శంకరం గారి అమ్మాయి సరసిజకు మొగుడు విడాకులిస్తున్నాట్ట. ఆ పిల్ల ఇంటికి వచ్చినప్పటినుండి గదిలో నుండి బయటకు రాకుండా ఏడుస్తూ కూర్చున్నదట. ఇంట్లో వంట చేసుకోలేదుట వాళ్ళు నిన్నంతా.

ఇరుగు-పొరుగు వాళ్ళ కష్టసుఖాల్లో పలకరించాలి కదా అని సాయంకాలం వాళ్ళింటికి వెళ్ళారు భానుమూర్తి, భ్రమరాంబ.

వీళ్ళు వెళ్ళేసరికి శంకరంగారి తమ్ముడు అతని భార్య, అపర్ణగారి చెల్లెలు, ఆమె భర్త ఇంట్లో వున్నారు. వాళ్ళు ఆ ఊళ్ళోనే వున్నారు గనుక విషయం తెల్సిన వెంటనే వచ్చేసారు. అందరి ముఖాల్లో బాధ, దిగులు కనబడుతున్నాయి.



"వాళ్ళిద్దరి జంటను చూసిన వాళ్ళెవరూ ఇలా జరుగుతుందని ఊహించలేరు శంకరంగారూ! 'తమలపాకుతో తానొకటంటే తలుపు చెక్కతో తాను రెండంది' అన్నంత అన్యోన్యంగా వుండే వారు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అన్నట్టు కబుర్లు చెప్పుకుంటూ కనబడేవారు. ఏమిటో ఇలా జరిగింది" అన్నాడు భానుమూర్తి శంకరంగారిని ఓదారుస్తూ.

శంకరంగారి కళ్ళు ఎర్రబడ్డాయి. పిడికిళ్ళు బిగిసాయి. ఆయన ఏమీ అనకముందే ఆయన తమ్ముడు, తోడల్లుడు కలిసి ఒకరు భానుమూర్తి చెయ్యి మరొకరు అతని చొక్కా కాలరు పట్టుకుని పైకి లేపారు. వీధిగుమ్మం దాకా లాక్కెళ్ళి బయటకు నెట్టేసారు. భ్రమరాంబ లబలబలాడుతూ అతన్ని అనుసరించింది.

"మీరు సానుభూతి చూపడానికి వచ్చిన స్నేహితులా? పుండుమీద కారం చల్లడానికి వచ్చిన శత్రువులా? చదువుకుంటే ఏం లాభం? బుద్ధీ, జ్ఞానం వుండాలి మనుషులకు" అంటూ దఢాలున తలుపులు వేసుకున్నారు.

"ఎంత మర్యాద లేని మనుషులు? ఇలాంటి వాళ్ళను పలకరించడానికి వెళ్ళడం మన మూర్ఖత్వం" అంటూ చిందులు తొక్కాడు భానుమూర్తి ఇంటికి వచ్చాక.

జరిగిన విషయం ఆ నోటా ఈ నోటా వీధిలో అందరికీ తెలిసింది. భానుమూర్తి కనబడితే వింతమనిషిని చూసినట్టు చూడ్డం మొదలుపెట్టారు. భ్రమరాంబ తలెత్తుకోలేనట్టు వీధిలోకి రావడం మానేసింది.

ఇంతజరిగినా తన పొరబాటు ఏమిటో భానుమూర్తికి అర్థం కాలేదు.

పై నెలలో భానుమూర్తి అద్దెకుంటున్న ఇంటి యజమాని కూతురి పెళ్ళి తలపెట్టారు. మర్యాదకు వచ్చి పెళ్ళిపత్రిక ఇచ్చి వెళ్ళాడాయన.

ఇన్నేళ్ళుగా వాళ్ళ ఇంట్లో అద్దెకువుంటూ పెళ్ళికి వెళ్ళకపోతే ఎలా అనుకుంటూ పెళ్ళి తిరుచానూరులో అయినా ఛార్జీలు పెట్టుకుని పెళ్ళికి వెళ్ళాడు భానుమూర్తి సతీసమేతంగా.

"కాకి ముక్కుకు దొండపండులా జంట బావుంది జగన్నాథంగారూ!" అని ఇంటి యజమానిని అభినందించాడు భానుమూర్తి. ఆయన పళ్ళు పట పట లాడించాడు గానీ జవాబు పలుకలేదు.

'ఈయనకు చలి జ్వరం వచ్చినట్టుంది పాపం' అనుకుని, అందరికీ నమస్కారాలు చేస్తూ అటువచ్చిన జగన్నాథంగారి కూతుర్నీ అల్లుడినీ అక్షతలు జల్లి దీవించాడు భానుమూర్తి. 'కాకిలా కలకాలం కాక హంసలా ఆర్నెల్లు సుఖంగా వుండండి' అని.

జగన్నాథంగారి బంధువులు నలుగురు భానుమూర్తిని చావబాదారు. పెళ్ళి పందిరిలో నుండి బయటకు నెట్టేశారు.

జగన్నాథంగారు పూనకం వచ్చినవాడిలా అరిచారు "మేము వచ్చేసరికి మీరు ఇల్లు ఖాళీ చేయకపోతే సామాన్లు బయటకు విసిరేయిస్తాను ఖబడ్దార్" అంటూ.

నలుగురు మీదపడి కొట్టడంతో భానుమూర్తి చెయ్యి విరిగింది. ఎట్లాగో ఊరికి తిరిగి వచ్చి ఆస్పత్రిలో పడ్డాడు.

విషయం తెలిసి అతన్ని చూడడానికి ఆస్పత్రికి వచ్చారు మానేజరు ప్రకాశరావు గారు, ఇంకా కొంతమంది సహోద్యోగులు.

"మీరు రావడం 'మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టు' కాస్త ఓదార్పుగా వుంది నాకు" అని మూలుగుతూ చెప్పాడు భానుమూర్తి.

"సారీ భానుమూర్తీ! మీకు ట్రాన్స్‌ఫర్ అయింది. కొత్తచోటులో అయినా కాస్త జాగ్రత్తగా వాడండి సామెతలు. అసలు నన్నడిగితే 'ఊరుకోవడమంత ఉత్తమం బోడిగుండంత సుఖం లేదు' మీ విషయంలో. ఆల్ ది బెస్ట్" అంటూ బదిలీ ఆర్డరు అందించాడు ప్రకాశరావు.

వాళ్ళు వెళ్ళిపోయాక భానుమూర్తి ఏదో అనడానికి నోరు తెరిచాడు. "ఇక సామెతలు వాడితే నా మీద ఒట్టే" అంది భ్రమరాంబ, ఆయన నోటిమీద చెయ్యివేసి.

## పారిపోయిన భయం

మదనపల్లి అందాల చిన్నది బిందుమాధవి 'ఆవకాయ్ బిర్యానీ'తో తెలుగు తెరకి పరిచయమైంది. ఆ సినిమా చెప్పుకోదగిన హిట్టు కాకపోయినా బిందుకి మాత్రం మంచి మార్కులే వచ్చాయి. దాంతో ఇప్పుడామె రెండు మూడు సినిమాల్లో నటిస్తోంది. పూరి జగన్నాథ్ తమ్ముడు సాయిరామ్ శంకర్‌తో 'బంపర్ ఆఫర్' అనే సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్న బిందు మాధవి చిన్నప్పుడు తన డాడీ అంటే తెగ భయపడిపోయేదాన్నని చెబుతుంది. ఆయన్ని చూస్తే చాలు బోల్డు భయం కలిగేదట. కానీ పెద్దయ్యాక మేమిద్దరం భలే ఫ్రెండ్స్ అయిపోయాం అని నవ్వేస్తుంది.